క్లుప్తంగా

నేటి నుంచి ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ముర్షద్ దర్గాలో నేటి నుంచి 77వ ఉర్సు షరీఫ్ ఉత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ గని పాష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు గంధం, గురువారం దీపోత్సవం, రాత్రి కవ్వాలి, శుక్రవారం నమాజ్ బాద్ ఫజర్ తిలావత్ ఖురన్పాక్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని మత పెద్దలు సయ్యద్ అబ్దుల్ గఫూర్ పాష, ఖుర్షీద్ పాష, అన్వర్ పాష, అబ్దుల్ జావిద్ పాష కోరారు.

తాండూరు డీటీగా విజయేందర్



తాండూరు రూరల్: డిప్యూటీ తహసీల్దార్‌గా విజయేందర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన డీటీ ధనుంజయ్.. గద్వాల జిల్లాకు తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న విజయేందర్.. తాండూరు డీటీగా వచ్చారు.

నోట్ బుక్స్ పంపిణీ



ట్రస్ట్ అందజేసిన నోటుబుక్కులతో విద్యార్థులు

తాండూరు టౌన్: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పీపుల్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యదర్శి భానుప్రసాద్ మాట్లాడారు. యేటా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్కులు, మెటీరియల్స్, ఇతర వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, శుభప్రద్ యువసేన సభ్యులు బాలు, చంద్రశేఖర్, శ్రీశైలం, నరేష్ గౌడ్, సాయి, విజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ గ్రామ కమిటీ ఎన్నిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న నర్మద

కొడంగల్: మండల పరిధిలోని అంగడిరాయిచూర్‌లో బీఎస్పీ గ్రామ కమిటీని ఆదివారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప ఆధ్వర్యంలో పలువురు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా నర్మద మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకే కమిటీలను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కార్యదర్శిగా పకీరప్పలతో పాటు పలువురిని కమిటీలోకి తీసుకున్నట్లు తెలిపారు.

అతివలు ఆర్థికాభివృద్ధి చెందాలి



మహిళలతో మాట్లాడుతున్న బ్యాంకు అధికారి మధన్ రెడ్డి

కుల్కచర్ల: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ మధన్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మహిళా సంఘాలతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మహిళలు ప్రభుత్వాలు కల్పిస్తున్న ఆర్థిక సహకారాలను సద్వినియోగం చేసుకొని, కుటుంబాల ఉన్నతికి పాటుపడాలని చెప్పారు. అదే విధంగా బ్యాంకులు అందజేస్తున్న రుణాలను సకాలంలో చెల్లించాలని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు కొండయ్య, వెంకట నర్సింహులు, శ్రీను, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

తాండూరు: తాండూరు గీన్ అండ్ సీడ్స్ మర్చంట్ (గంజ్) అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు అసోసియేషన్ హాల్‌లో జరిగిన ఎన్నికలకు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటును ఏకగ్రీవం చేయాలని సభ్యులు తీర్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్‌రాములుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీధర్, కార్యదర్శిగా కిరణ్, సంయుక్త కార్యదర్శిగా బోజిరెడ్డి, కోశాధికారిగా కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా రాంరెడ్డి, దామోదర్, సుధాకర్, ఠాకూర్, వీరేందర్, రవీందర్, రాజేష్‌సోని, నర్సింహులు, మల్లప్పలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీ ప్రతినిధులను సన్మానించారు.

సామాజిక తనిఖీకి సిద్ధం



రికార్డులు సిద్ధం చేస్తున్న ఉపాధి సిబ్బంది

- రెండున్నరేళ్ల అనంతరం నిర్వహణ
- రూ.12కోట్ల విలువైన ఉపాధి పనులు
- దస్త్రాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- మరో వారంలో ప్రక్రియ మొదలు

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయడంలో ఈజీఎస్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. రెండున్నరేళ్ల అనంతరం మరో వారం రోజుల్లో సోదా నిర్వహించనున్నారు.

పనులు కల్పించడమే లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు పనులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టింది. ఇందులో ఇప్పటి వరకు ఏఏ పనులు చేపట్టారు. పనులు ఎంత వరకు జరిగాయి. కూలీలకు డబ్బులు అందాయా లేదా అనే దానిపై క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించనున్నారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో ఈ మూడున్నరేళ్లలో చెరువులు, కుంటల్లో పూడికతీత, జంగల్ కటింగ్, హరితహారంలో మొక్కలు నాటడం, వాటి పర్యవేక్షణ, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, కల్లాల నిర్మాణాలు రైతుల భూముల చదును చేయడం, చేపల పెంపకం చెరువులు, పశువుల పాకలు, వననర్సరీల్లో మొక్కల పెంపకం, అలాగే సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.

రూ.12 కోట్ల విలువ పనులు

మండలంలో 2020 డిసెంబర్ నుంచి మార్చి 2023 వరకు రూ.9,88,43,188 కోట్లతో వేజ్ పనులు, రూ.2,44,85,392 కోట్లతో మెటీరియల్‌తో పనులు చేపట్టారు. ఇందులో ఎంతవరకు పనులు జరిగాయి. కూలీలకు కూలి డబ్బుల చెల్లింపు, తదితర వాటి వివరాలను మాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు.

అవకతవకలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. వీటిల్లో చేసిన పనులను పర్యవేక్షించాల్సి ఉండగా.. ఎలా సాధ్యమనేది ఉత్పన్నమయ్యే ప్రశ్న. మొక్కలు పెంపకానికి గుంతలు తవ్వడం, నాటిన మొక్కలను గుర్తించడం సవాల్‌గా మారనుంది. కల్లాల నిర్మాణాల్లో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై సామాజిక బృందం ఎంత వరకు వాస్తవాలు, అవాస్తవాలు వెలికి తీస్తుందో చూడాలి.

బృందాల వారీగా..



ఉపాధిహామీ పథకంలో 2020 డిసెంబర్ నుంచి మార్చి 2023 వరకు మండలంలో చేపట్టిన పనుల గురించి తనిఖీ చేసేందుకు వారం రోజుల్లో బృందం మండలానికి రానుంది. అందుకు సంబంధించిన వివరాలను సిద్ధం చేస్తున్నాం. గ్రామాల్లో బృందాల వారీగా సోదాలు చేపడతారు. గ్రామసభల అనంతరం పనుల సామాజిక తనిఖీల గురించి పూర్తి స్థాయిలో నివేదికను వెల్లడిస్తారు.

– తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

అమరుల స్ఫూర్తితో పోరాటం

సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకటయ్య



అమరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: అమరుల త్యాగాల స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించి, విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాలని ఆగస్టు 28, 2000 సంవత్సరంలో పోరాటం చేసి అమరులైన సీపీఎం నాయకుల చిత్రపటాలకు సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో మంది ఉద్యమకారులు ప్రజా హక్కుల చేసిన పోరాటంలో ప్రాణాలను కోల్పోయారని, వారి స్ఫూర్తి తమలో ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. నాడు చేసిన ఉద్యమంతో మళ్లీ ఏ ప్రభుత్వం కూడా.. విద్యుత్ చార్జీలు పెంచేందుకు సాహసించలేదని చెప్పారు. కానీ నేడు రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా కరెంట్ చార్జీలకు పెంచి, నిరుపేదలపై పెనుభారం మోపుతుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పేందుకు తాము సిద్ధం అయ్యామన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, ప్రభు, బాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగా మంత్రి పదవి చేపట్టిన (గనులు, భూగర్భ శాఖ) పట్నం మహేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన తాండూరు డీఎస్పీ శేఖర్ గౌడ్

– తాండూరు టౌన్

104 సిబ్బందిని గుర్తించని సర్కార్

అనంతగిరి: 104లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆరోపిస్తూ.. వెంటనే రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైద్యశాఖలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నామని, అయినా తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో కుటుంబం గడవటం కష్టంగా ఉందని, మిగతా శాఖల మాదిరిగానే తమను కూడా క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, గోవర్ధన్, రాజేశ్వర్ రెడ్డి, మల్లేశ్, వినోద, శాంతామణి రాజశేఖర్, శ్రీధర్ స్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మైపాల్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులపై చిన్నచూపు తగదు

తాండూరు: యాదవ కులస్తులను రాజకీయ పార్టీలు, ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకుడు, ప్రముఖ న్యాయవాది నర్సింగ్‌రావు యాదవ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని నెహ్రూగంజ్‌లో సంఘం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రంగాల్లో యాదవులకు అవకాశం కల్పించాలని, రాజకీయ పార్టీలు ప్రాధాన్యత చూపాలని కోరారు. తగిన ప్రాధాన్యత కోసం త్వరలో సంఘం సభ్యులంతా కలిసి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేశ్, గోపాలకృష్ణ, హన్మంత్, రాజు, రమేష్, శేకర్, శ్రీనివాస్, లాలప్ప, గుండప్ప, వెంకటేశ్ యాదవ్‌లు పాల్గొన్నారు.

‘సమ్మె ఉధృతం చేస్తాం’

అనంతగిరి: నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం ఏఎన్ఎంలు ఎన్నేపల్లి చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేని యెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి, లలిత, పాపమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న రియల్టర్ శ్రీధర్

మర్పల్లి: పట్లూర్‌లో చేపట్టిన దుర్గామాత ఆలయ నిర్మాణానికి ప్రముఖ రియల్టర్ శ్రీధర్ రూ.6 లక్షల విరాళం సోమవారం దేవాలయ కమిటి సభ్యులకు అందజేశారు. దీంతో దైవ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేసిన శ్రీధర్‌కు.. సర్పంచ్ దేవర దేశి ఇందిర కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఉన్నారు.

యువత సోషల్ మీడియా మత్తులో పడొద్దు

సబ్ రిజిస్ట్రార్ భీంరాజ్

మొయినాబాద్: యువత క్రీడల్లో రాణించాలని సబ్ రిజిస్ట్రార్ భీంరాజ్ అన్నారు. మండలంలోని సురంగల్‌లో కర్రోళ్ల కృష్ణయ్య జ్ఞాపకార్థం సురంగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో 6 జట్లు పాల్గొని తలపడ్డాయి. ఎస్ఎంఆర్, సిక్స్‌స్టార్ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా సాగిన ఆఖరి పోరాటంలో ఎస్ఎంఆర్ జట్టు విజయం సాధించింది. బహుమతుల ప్రదానం కార్యక్రమానికి భీంరాజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు, యువత సోషల్ మీడియా మత్తులో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు భాస్కర్, షఫీ, నారాయణరెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు ధన్‌రాజ్, శ్రీధర్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, ప్రభుయాదవ్, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

గతుకులు.. అతుకులు

- ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన పనులు
- ఇప్పటికీ పూర్తి కాని వైనం



సురంగల్ రోడ్డు దుస్థితి

మొయినాబాద్: ఓ వైపు నుంచి రెండు కిలోమీటర్ల దూరం తారు రోడ్డు వేశారు. మరో వైపు నుంచి సుమారు కిలోమీటర్ దూరం సిమెంటు రోడ్డు వేశారు. మధ్యలో 200 మీటర్ల దూరం రోడ్డు వేయకుండా వదిలేశారు. మండల పరిధిలోని చిలుకూరు నుంచి మొయినాబాద్ మీదుగా సురంగల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం రూ.2.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పట్లోనే మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సబితారెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆరు నెలల తరువాత పనులు ప్రారంభించారు. మొదటగా సురంగల్ గ్రామం నుంచి కిలోమీటర్ దూరం వరకు సిమెంటు రోడ్డు వేశారు. ఆ తరువాత మొయినాబాద్ నుంచి సురంగల్ పెద్ద చెరువు అలుగు వరకు బీటీ రోడ్డు వేశారు. మధ్యలో సుమారు 200 మీటర్ల దూరం రోడ్డు వేయకుండా వదిలేశారు. పెద్ద చెరువు అలుగు సమీపంలో రోడ్డుపై కల్వర్టు నిర్మించాల్సి ఉంది. మిగిలిన 200 మీటర్ల దూరం సీసీరోడ్డు వేయాల్సి ఉన్నా పంచాయతీ రాజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కల్వర్టు నిర్మించాల్సిన చోట పైపులు పగిలి రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం పడింది. వర్షానికి రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎంపీపీ, జెడ్పీటీసీ చొరవ తీసుకుని రోడ్డు పనులు పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
- రైతులకు పశువైద్యాధికారుల సూచన



సయ్యద్‌అల్లిపూర్‌లో ఆవుకు గర్భకోశ వ్యాధి చికిత్స చేస్తున్న వైద్యురాలు

మోమిన్‌పేట: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, అందుకు ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి గీత సూచించారు. సోమవారం మోమిన్‌పేట మండలం సయ్యద్‌అల్లిపూర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె మాట్లాడారు. ఇందులో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, గర్భకోశ వ్యాధి చికిత్సలు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యాధి సోకితే పశువుల కాళ్లల్లో పుండ్లు ఏర్పడి జ్వరం వచ్చి గడ్డి తినడం మానేస్తాయని, దీంతో పశువు బక్కచిక్కిపోతుందని ఆమె పేర్కొన్నారు. ఆవులు, బర్రెలు పాలు ఇవ్వడం మానేస్తాయని, దీంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఆవులు, బర్రెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలను చేయించుకోవాలని చెప్పారు. ఈ శిబిరంలో 18 పశువులకు చూడి, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మైనార్టీలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- ‘మైనార్టీ బంధు’ చెక్కుల పంపిణీ

కొడంగల్: ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన పలువురు మైనార్టీ లబ్ధిదారులకు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒక్కొక్కరికీ ‘మైనార్టీ బంధు’ సాయం రూ.లక్ష చొప్పున మంజూరైన చెక్కులను అందజేసి మాట్లాడారు. మైనార్టీలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ బంధు పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, గుల్షన్, నావాజొద్దీన్, రమేష్‌బాబు, అంజద్, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. సోమవారం ఉదయం ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. పట్టణంలోని సన్‌సిటీ కాలనీలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. అక్కడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించండి..

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మీ సేవా నిర్వాహకులు ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మీ సేవా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తున్నాయని, తమకు ఆరోగ్య కార్డులు, బీమా సౌకర్యం కల్పించాలని, కమీషన్ పెంచాలని పేర్కొన్నారు. ఇందులో మూడు మండలాలకు చెందిన మీ సేవా నిర్వాహకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన సుమారు 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో అధికార పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ మొహన్‌రెడ్డి, మార్కెట్ కమిటి డైరెక్టర్ భానుప్రకాష్, నరోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

డాక్టర్ ఎండీ వాహజుద్దీన్‌ఖాన్



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాహజుద్దీన్‌ఖాన్

షాద్‌నగర్ రూరల్: పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యునాని ఆసుపత్రి డాక్టర్ ఎండీ వాహజుద్దీన్‌ఖాన్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద యునాని ఆసుపత్రి పరిధిలోని అప్పారెడ్డిగూడలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వాహజుద్దీన్‌ఖాన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలు అంటువ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటుగా వ్యక్తిగత పరిశుభ్రతను తప్పని సరిగా పాటించాలన్నారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైదులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజిత, ఫార్మాసిస్టు అలవేలమ్మ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

షాబాద్: రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రాజేందర్‌గర్ పీవీ నర్సింహరావు పశువైద్యకళాశాల వైస్ చాన్స్‌లర్ రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండలంలోని రేగడిదోస్వాడ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద పీవీ నర్సింహరావు పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో వంద మంది రైతులకు ఉచితంగా పెరటి కోడిపిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు పెరటి కోళ్లు పంపిణీ చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కోళ్ల పెంపకంతో రైతులు ఆదాయం పొందవచ్చన్నారు. భవిష్యత్తులో ఎస్సీ రైతులకు మేకలను ఉచితంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీవీ నర్సింహారావు, పశువైద్యకళాశాల ప్రిన్సిపాల్‌లు రఘునందన్, ఉదయ్‌కుమార్, ప్రొఫెసర్లు డాక్టర్ నర్సింహా, గోపాలకృష్ణ, సత్యనారాయణరాజు వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కంకర రోడ్డుపై ప్రయాణం కష్టతరం



ఎబ్బనూర్ చెరువు సమీపంలో కంకర రోడ్డు

నాలుగు నెలలుగా వాహనదారుల ఇక్కట్లు

ధారూరు: కంకర రోడ్డు వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. మే నెలలో ప్రారంభమైన మెటల్ కం బీటీరోడ్డు పనులు నేటికీ కంకర పరిచిన స్టేజిలోనే నిలిచిపోవడంతో ఈ రహదారిపై ప్రయాణం కష్టతరంగా మారింది. ధారూరు మండలం బాచారం గ్రామ సమీప పీడబ్ల్యూడి రోడ్డు నుంచి ఎబ్బనూర్, ఎబ్బనూర్ చెరువు మీదుగా వికారాబాద్‌కు వెళ్లే ఈ రోడ్డులో పయనిస్తున్న వారు చుక్కలు చూస్తున్నారు.

రూ.1.62 కోట్లు మంజూరు

3కిలో మీటర్ల ఈ రోడ్డుకు రూ.1.62 కోట్లు ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద నిధులు మంజూరు అయ్యాయి. కారణం ఏదైనప్పటికీ.. సదరు నిర్మాణ దారుడు పనులు ఇలా మధ్యలో ఆపేయడంతో పరిసర ప్రాంత ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణ పనులు వేగిరం చేయించి, రవాణా ఇక్కట్లను తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వారం రోజుల్లో షురూ

రోడ్డు నిర్మాణ పనులను దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్‌కు కంకర సకాలంలో లభ్యం కాలేదు. దీంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోంది. వారం రోజుల్లో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటాం. రీబీటీ అసంపూర్తి పనులపై కాంట్రాక్టర్‌తో చర్చించాం.

– ఏఈ ప్రణీత్